ప్రజాశక్తి
ఆదివారం 16 ఏప్రిల్ 2023
5
శ్రీ సత్యసాయి





ర్యాలీలో పాల్గొన్న సిపిఎం అభిమానులు, మద్దతుదారులు

అభిమాన ప్రవాహం

బాగేపల్లి సిపిఎం అభిమాన ప్రవాహంతో నిండిపోయింది. వేలాది మంది చేయిచేయి కలిపి సిపిఎం అభ్యర్థి నామినేషన్‌కు తరలొచ్చారు. విద్యార్థుల దగ్గర నుంచి వృద్ధుల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం తెలిపారు. నామినేషన్ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీ, బహిరంగ సభతో బాగేపల్లి వీధులు ఎరుపెక్కాయి. సిపిఎం మద్దతు దారులు, అభిమానుల నడుమ అట్టహాసంగా సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. శనివారం ఉదయం బాగేపల్లి పట్టణంలో జరిగిన ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

- ఎరుపుమయం అయిన బాగేపల్లి
- అట్టహాసంగా సిపిఎం నామినేషన్
- భారీగా తరలివచ్చిన జనం
- ముఖ్య అతిథిగా సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి హాజరు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సిపిఎం అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ నామినేషన్ సందర్భంగా బాగేపల్లి పట్టణంలో నేషనల్ కాలేజీ నుంచి కెబిహెచ్ గ్రౌండ్స్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనకు నియోజకవర్గం పరిధిలోని అనేక గ్రామాల నుంచి పిల్లలు, 80 ఏళ్ల ముసలి వాళ్ల వరకు ఎర్రజెండాలను చేతపట్టుకుని కదం తొక్కారు. సిపిఎంకు జై... అనిల్ కుమార్‌ను గెలిపించుకుందామంటూ నినాదాలు చేస్తూ సాగిన ప్రదర్శనతో బాగేపల్లి పట్టణం ఎరుపెక్కింది. అనంతరం సిపిఎం చిక్‌బళ్లాపూర్ జిల్లా కార్యదర్శి మునివెంకటప్ప అధ్యక్షతన జరిగిన బహిరంగ సభకు సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సభలో జెడిఎస్ రాష్ట్ర నాయకులు రామకృష్ణారెడ్డి, మహమ్మద్ నూరుల్లా సభలో పాల్గొని మద్దతునిచ్చారు. సభ ప్రారంభానికి ముందు మాజీ ఎమ్మెల్యే జివి.శ్రీరామిరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏచూరి మాట్లాడుతూ ప్రస్తుతమున్న రాజకీయ పరిస్థితుల్లో కర్నాటకలో సిపిఎం గెలుపు ఎంతో ముఖ్యమని చెప్పారు. గెలిచేది ఒక్కరే అయినా ప్రజల తరుపున గొంతును అసెంబ్లీలో వినిపించే వ్యక్తి అనిల్ కుమార్ ఒక్కరే అవుతారని పేర్కొన్నారు. ఏ పార్టీల నుంచి ఎంత మంది నేతలున్నా ప్రజా సమస్యలను పట్టించుకోరని తెలిపారు. కోవిడ్ సమయంలోనూ ఈప్రాంతంలో ప్రజల కోసం అనిల్ కుమార్ ఏ రకంగా పనిచేసారో అందరూ చూసుంటారని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. బిజెపి రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ రాజకీయ అంగాలుగా మార్చేస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే బిజెపిని ఓడించక తప్పదని పిలుపునిచ్చారు. అభ్యర్థి డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది సిపిఎం మాత్రమేనని చెప్పారు. సిపిఎంకు అవసరమైన బలాన్ని ఈ ఎన్నికల్లో ఇవ్వాలని కోరారు. ఇతర పార్టీల అభ్యర్థులు బిజెపి, కాంగ్రెసు నాయకులు ఎన్నికల్లో ప్రలోభ పెట్టడమే తప్ప ఆ తరువాత సమస్యలను పట్టించుకోరని విమర్శించారు. స్థానికంగా ఉండేది తాను ఒక్కడినే అని తెలిపారు. నియోజకవర్గంలో అనేక సమస్యలున్నాయని చెప్పారు. ఆ సమస్యలపై సిపిఎం ఇది వరకే సర్వే నిర్వహించి గుర్తించిందన్నారు. విద్యపరంగా ఎంతో వెనుకబాటుతనం ఉందన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వరలక్ష్మి మాట్లాడుతూ బిజెపి పాలనలో మహిళలు, మైనార్టీలపైనా దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. కర్ణాటకలో బిజెపి ప్రభుత్వం 40 శాతం కమీషన్ ప్రభుత్వంగా అందరూ పిలుచుకునే పరిస్థితి వచ్చిందన్నారు. అవినీతిమయంగా ఈ ప్రభుత్వం మారిందని విమర్శించారు. స్థానికంగా అందుబాటులో ఉండే అనిల్ కుమార్‌కు మద్దతునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఉమేష్, కర్ణాటక కార్యదర్శి బసవరాజు, కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాశ్, చిక్ బళ్లాపుర్ కార్యదర్శి మునివెంకటప్ప, తాలుకా కార్యదర్శి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ సందర్భంగా బహిరంగ సభకు హాజరైన సిపిఎం శ్రేణులు, అభిమానులు



అధికారుతో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి

కలెక్టర్ అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సుస్థిర అభివద్ధి లక్ష్యాలు సాధించి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతి డాక్టర్ సెల్ నెంబరు డిస్‌ప్లేలో ప్రదర్శించాలని జిల్లా వైద్య అధికారి ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. కంటి వెలుగు, ఫీవర్ సర్వే వంద శాతం సంబంధిత ఏఎన్ఎం ద్వారా నమోదు చేయించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల బలోపేతానికి ఐసిడిఎస్ పీడీని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయాలని, తాను కూడా క్షేత్రస్థాయి పర్యటన చేస్తామన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, వైఎస్ఆర్ కిట్టు, నిత్యావసర సరుకుల నిల్వ తదితర అంశాలపై కలెక్టర్ సంబంధిత అధికారులతో ఆరా తీశారు. సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ పిల్లలకు ఏర్పాటు చేయనున్నామన్నారు. సంక్షేమ వసతి గహాల్లో పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. ఆ శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రతివారం సుస్థిర అభివద్ధిపై లక్ష్యాలపై సమీక్షించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఒ ఎస్‌వి.కృష్ణారెడ్డి, డిసిహెచ్ఒ తిప్పేంద్ర నాయక్, బీసీ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, ఐసిడిఎస్ పీడీ లీల కుమారి, సాంఘిక సంక్షేమ అధికారి శివరంగ ప్రసాద్, గిరిజన సంక్షేమ అధికారి మోహన్ రావు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ ప్రతాప్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పేదల భూములను లాక్కొంటే సహించం



భూ స్వాధీనం అనంతరం సాగుదారులతో మాట్లాడుతున్న వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

- వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు
- కోగిరలో భూస్వాధీన పోరాటం
- పొలాల్లో ఎర్రజెండాలు పాతి నిరసన

ప్రజాశక్తి-రొద్దం

దశాబ్దాలుగా సాగులో ఉన్న పేదల భూములను అక్రమంగా లాక్కోవాలని చూస్తే చూస్తూ ఊరుకోమని సిపిఎం, వ్యకాసం ఆధ్వర్యంలో వారికి అండగా నిలబడి పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. రొద్దం మండలంలోని కోగిర రెవెన్యూ పొలంలో వ్యకాసం ఆధ్వర్యంలో సాగుదారులు శనివారం నాడు భూస్వాధీన ఉద్యమం నిర్వహించారు. వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సత్యసాయి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న తదితరులు సాగుదారులతో కలిసి పొలాల్లోకి వెళ్లారు. ఈ సమయంలో అక్కడున్న టింబక్టివ్ కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ప్రయివేటు రౌడీలు వ్యకాసం నాయకులు, పేదలను బలవంతంగా అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిని ఎదిరించి వ్యకాసం నాయకులు, సాగుదారులు భూముల్లోకి ప్రవేశించారు. ఆ భూముల్లో ఎర్రజెండాలు నాటి భూ స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండల పరిధిలోని కోగిర సమీపంలో కొండ ప్రాంతంలో ఉన్న భూములను కోగిర, కంబాలపల్లి, శ్యాంపురం గ్రామాలకు చెందిన దళిత, గిరిజన, బీసీ నిరుపేద రైతులు దశాబ్ధాల కాలం నుంచి సాగు చేసుకుంటున్నారని చెప్పారు. పేదల అనుభవంలో ఉన్న కోగిర రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 666 నుంచి 669 వరకు దాదాపు 4500 ఎకరాల భూమిని ప్రభుత్వం, అధికారులు టింబక్టివ్ కలెక్టివ్ అనే ప్రయివేటు స్వచ్ఛంద సంస్థకు దొడ్డిదారిని అప్పజెప్ప కుట్ర జరుగుతోందన్నారు. సదరు స్వచ్ఛంద సంస్థ కూడా ఆ భూములను నిబంధనలకు విరుద్ధంగా భూకబ్జాకు పాల్పడి దౌర్జన్యంగా ఆక్రమించు కుంటోందన్నారు. పేదలను భూముల్లోకి రానివ్వకుండా సెక్యూరిటీ పేరుతో వారి ప్రయివేటు రౌడీలతో భయపెడుతోందన్నారు. భూముల్లోకి వెళ్తే దాడులకు పాల్పడుతున్నారని చెప్పారు. మహిళలు అని చూడకుండా వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఘటనలు ఉన్నాయన్నారు. తప్పుడు పత్రాలతో భూములను కాజేసే కుట్ర చేస్తున్నారని చెప్పారు. బాధితులకు భూమి దక్కేంత వరకు సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం వారి పక్షాన పోరాటం సాగిస్తుందని చెప్పారు. భూమి అన్యాక్రాంతం కాకుండా పేదలకు దక్కే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాగుదారులకు అడ్డు తగులుతూ దాడులు చేస్తున్న సంస్థకు చెందిన రౌడీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు స్పందిచకుంటే రానున్న ఖరీఫ్‌లో తామే దగ్గరుండి రైతులతో ఆ పొలాల్లో సాగు చేయిస్తామన్నారు. భూమిలేని ప్రతి పేదవాన్ని గుర్తించి ఈ భూమిని వారికి పంచతామని తెలిపారు. అవసరం అయితే కోర్టు ద్వారా న్యాయ పోరాటానికి కూడా వెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు, నారాయణ, సాగుదారులు కిష్టప్ప, నరసింహప్ప, మారుతి, నారాయణమ్మ, అనితమ్మ, లక్ష్మీబాయితో పాటు 200 మంది పాల్గొన్నారు.

ప్రాణాలు పోయినా చలనం లేని ప్రభుత్వం

ధర్నాలో రీలర్లు

హిందూపురం : పట్టు రీలర్లకు ప్రభుత్వం ఇవ్వాల్సిన ఇన్సెంటీవ్ కోసం రీలర్ల నాయకులు రాజధాని చుట్టూ తిరిగి ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయినా స్పందన లేకపోవడం బాధాకరమని పట్టు రీలర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఖలీల్‌బాషా, ముస్తఫా, అన్సార్ అన్నారు. ఇన్సెంటీవ్ వెంటనే విడుదల చేయాలన్న డిమాండ్‌తో రీలర్లు శనివారం పట్టుగూళ్ల మార్కెట్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పట్టురీలర్లు 250 మందికి రెండున్నర సంవత్సరాల నుంచి శిల్క్ పై అందించాల్సిన బకాయి రూ.11కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమకు అందాల్సిన ఇన్సెంటీవ్ గురించి ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులను కోరినా ప్రయోజనం లేదన్నారు. ఈ బకాయి విషయం సీఎంతో మాట్లాడేందుకు వెళ్లే సమయంలో వాహన ప్రమాదంలో రీలర్ల సంఘం అధ్యక్షులు రియాజ్ ప్రాణాలు కోల్పోయాడని, అయినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని వాపోయారు. పట్టు పరిశ్రమ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంపై దృష్టి సారించి తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై పట్టుపరిశ్రమ సహాయ సురేష్ విలేకరులతో మాట్లాడుతూ రీలర్లకు అందాల్సిన ఇన్సెంటీవ్ బకాయిల విషయం ఉన్నతాధికారులకు నివేదించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రీలర్లు పాల్గొన్నారు.



పట్టుగూళ్ల మార్కెట్ ముందు ధర్నా చేస్తున్న రీలర్లు

అండర్ - 17 జాతీయ క్రికెట్ జట్టుకు ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మండలంలోని నాగలూరు వద్దగల రూపారాజా పీసీఎంఆర్ పాఠశాల విద్యార్థులు అండర్ -17 జాతీయ జట్టుకు ఎంపికైనట్టు పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలిపారు. పాఠశాలలో 9వతరగతి చదువుతున్న యువన్‌కుమార్‌రెడ్డి, శరత్‌సాయి అండర్-17 జాతీయ క్రికెట్ జట్టుకు స్కూల్ స్పోర్ట్స్, కల్చరల్ అసోషియేషన్ తరపున ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులు మే 27 నుండి 29వతేదీవరకు ఉత్తరాఖండ్‌లో జరగనున్న క్రికెట్ మ్యాచ్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ తోపాటు డైరెక్టర్లు రూపారాజాకృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ శైలజారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

పట్టణ సమస్యలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్నా ప్రధాన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌ను కాంగ్రెస్ నాయకులు శనివారం కలిశారు. పట్టణ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కోంటున్న ప్రధాన సమస్యలపై ఆయనతో చర్చించారు. స్పందించిన కమిషనర్ అన్ని సమస్యలపై తగిన చర్యలు తీసుకోంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలాజీ మనోహర్, అమానుల్లా, ఎండి గౌస్, యూనూస్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌ను కలిసి బొకే అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అప్రమత్తతతో వ్యవహరించాలి : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

రానున్న సంవత్సరం ఎంతో కీలకమైనదని అందుకోసం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు నిరంతరం అప్రమత్తతో ఉండాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ మాధవరెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆయన జిల్లా పోలీస్ కార్యాలయం లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా పోలీస్ స్పెషల్ బ్రాంచి సిబ్బంది తో సమావేశమయ్యారు. పోలీస్ శాఖ లో స్పెషల్ బ్రాంచ్ ఎంతో కీలకమైనదని అన్నారు. ఇందులో పనిచేస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీఉమా మహేశ్వర రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐల, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈనెల 17న అనంతపురం జిల్లాకు రానున్న సందర్భంగా పుట్టపర్తి విమానాశ్రయంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి శనివారం పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏర్పాట్ల గురించి ఆయన అధికారులతో చర్చించారు. అనంతరం సత్యసాయి విమానాశ్రయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. విమానాశ్రయం బయట లోపల తీసుకోవాల్సిన జాగ్రత్తలు ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు వెళ్లే వారి సమాచారం అనుమతికి తదితర వాటిపై ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, జాయింట్ కలెక్టర్ చేతన్, ఎఎస్పీ రామకృష్ణప్రసాద్, ఆర్డీవో భాగ్యరేఖ, డీఎస్పీ యశ్వంత్, ప్రభుత్వ అధికారులు, విమానాశ్రయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆశావర్కర్ల ధర్నాను విజయవంతం చేయండి

పుట్టపర్తి రూరల్: శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ముందు ఈనెల 17న చేపట్టనున్న ఆశ వర్కర్ల ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జరప తలపెట్టిన కార్యక్రమంలో ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి తో పాటు సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు జడ్పీ శీనప్ప, ఇఎస్ వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షులు ఇంతియాజ్, రామకృష్ణ, సాంబయ్య పాల్గొననున్నారని చెప్పారు. జిల్లాలోని ఆశ వర్కర్లు హాజరై ధర్నాను విజయవంతం చేయాలని జానపద కళాకారుల సంఘం గంగాద్రి, పైపల్లి గంగాద్రి తదితరులు కోరారు.

రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు పరామర్శ

కదిరి టౌన్ : పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబాలను ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు పరామర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ జెఎసి అమరావతి ఆధ్వర్యంలో 38 రోజులుగా కొనసాగుతున్న నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం కదిరిలో పదవి విరమణ పొందినా ఉద్యోగుల కుటుంబాలను ఎంప్లాయిస్ యూనియన్ పరామర్శించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన బకాయిలు పదవి విరమణ పొందినప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే అందజేయాలని ఈ సందర్భంగా నాయకులు కోరారు. ఈకార్యక్రమంలోఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి శంకరప్ప, కోశాధికారి హరికుమార్, డిపో ప్రెసిడెంట్ జెడ్ ఖాన్, డిపో సీనియర్ నాయకులు సుధీందర్, కుటాగుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలి

కదిరి అర్బన్ : విద్యార్థులందరూ ఉన్నత విద్యా శిఖరానికి చేరుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే చాంద్‌బాషా పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా కుటాగుళ్ళ మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్‌లో ఎస్ఎ రాత పరీక్ష, పిఇఎస్ వారు నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా 3,4,5 తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు అత్తార్ చాంద్ బాషా చేతుల మీదుగా ప్రసంశాపత్రాలు, నగదు బహుమతి నగదును అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రశేఖర్, గిరిజన కమిషన్ మాజీ డైరెక్టర్ సోమ్లానాయక్, బయప్ప, మాజీ కౌన్సిలర్ శంకర, మధుసూదన్ రెడ్డి, లక్ష్మి, శీన, బాలచంద్ర, ఉపాధ్యాయులు ఫయాజ్, ప్రవీణ్, చంద్రశేఖర్, శీనా, సింధు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని జగరాజు పల్లి కస్తూరిబా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ శిరీష తెలిపారు. పాఠశాలలో 6 నుండి 9వ తరగతి వరకు ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరించనున్నామని ఈనెల 20 వ తేదీ వరకు గడువు ఉందని ఆమె తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

దుకాణాల తనిఖీ

రొద్దం : మండల కేంద్రంలో ఉన్న పలు దుకాణాలను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్ శనివారం తనిఖీ చేశారు. బేకరీలు, కూల్ డ్రింక్స్ తదితర దుకాణాలను తనిఖీ చేశారు. తినుబండరాలు తయారు చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది అర్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పది ' పరీక్ష కేంద్రాల పరిశీలన

బుక్కపట్నం : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్షలు ఏ విధంగా జరుగుతున్నాయి పరీక్షా కేంద్రంలోని విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై ఇన్విజిలేటర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఇన్విజిటర్లకు పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు ఎస్ఐ నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షా కేంద్రాలను శనివారం పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ తనిఖీ చేశారు. పరీక్ష నిర్వహణ గురించి ప్రధాన ఉపాధ్యాయులు ఖాదర్‌వలిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలో జరుగుతున్న జగనన్న భూ రక్ష పథకాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మురళీకృష్ణ, జిల్లా సర్వే అధికారి రామకృష్ణ, శాంతారాజ్, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ద్వారా అధిక దిగుబడులు

బుక్కపట్నం : రైతులు తమ పంట పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకుని వాటి ద్వారా ఎరువులు వాడి అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ అధికారి సతీష్ బాబు తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో భూసార పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ సూర్య నారాయణ, వీఆర్వో లక్ష్మీనారాయణ రెడ్డి , ఎఇఒ సుధా తదితరులతో పాటు రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ

కొత్తచెరువు : కొత్తచెరువు కు చెందిన వాల్మీకి శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆన కాలు విరిగింది. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే డి. శ్రీధర్‌రెడ్డి క్షతగాత్రుడిని శనివారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, వైసీపీ నాయకులు రెడ్డప్ప రెడ్డి, షాజహాన్, మటన్ శంకర్ తదితరులు పాల్గొన్నారు

మెప్మా ఆధ్వర్యంలో ఉచిత ఖత్నా

కదిరి టౌన్ : ఎపి మెప్మా ఆధ్వర్యంలో ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ మెప్మా అధ్యక్షులు ఖాదర్‌బాషా తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో ఏడు సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహించామనిఅందులో భాగంగా మే 14న కదిరి పట్టణంలోని ఉమర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉచిత ఖత్నా కారక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు చాంద్‌బాషా, అమిరుద్దీన్, ఇనాయతుల్లా, ఆసిఫ్, నీసార్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

ధర్మవరం టౌన్ : బత్తలపల్లి మండలం సంగాల తండాకు చెందిన జింకలనారప్ప అనే బాధితుడికి మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు ఆయన శనివారం తన వ్యక్తిగత కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జింకల నారప్ప కుమారుడు నాగరాజు ఇటీవల మృతిచెందాడని తెలుసుకున్న సూర్యనారాయణ తక్షణ సాయంగా రూ.20వేలను జింకల నారప్పకు అందజేశారు.

ఉచిత స్పోకన్ ఇంగ్లీష్ తరగతులు

ధర్మవరం టౌన్ : స్థానిక సత్యకృప మహిళా డిగ్రీకళాశాలలో ఈనెల 20వతేదీ నుండి ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు తరగతులను నిర్వహిస్తున్నట్లుకళాశాల ప్రిన్సిపల్ డోలాపెద్దిరెడ్డి, ఎస్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రంగారెడ్డి, ప్రిన్సిపల్ మల్లికార్జున, ఎఒ రమేష్ కోరారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన వారు కూడా స్పోకెన్ ఇంగ్లీషు తరగతులకు రావచ్చన్నారు. వేసవికాలంలో సమయాన్ని వృథా చేయకుండా ఈ ఉచిత స్పోకన్ ఇంగ్లీషు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పాలీసెట్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ

హిందూపురం : పాలీసెట్ -2023 ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు ఈ నెల 17 నుంచి స్థానిక హిందూపురం మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ హరీష్ బాబు శనివారం తెలిపారు. ఈ ఉచిత శిక్షణా తరగతులను విద్యార్థి, విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటవరకి కళాశాల ఆవరణలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించండి



నిరుపయోగంగా ఉన్న టిడ్కో గృహాలను చూపుతున్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని కర్నాటక నాగేపల్లి వద్ద ఏర్పాటుచేసిన టీడ్కో ఇళ్లలో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అందజేయాలని తెలుగుదేశం పార్టీ శ్రీ సత్య సాయి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం టిడ్కో ఇళ్లను పరిశీలించి అభివృద్ధిని సెల్ఫీ ద్వారా పత్రికా విలేకరులకు తెలిపారు. టిడ్కో ఇళ్లు టిడిపి హయాంలో నిర్మించారని, ఈ విషయం అందరికీ తెలుసునని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లవుతున్నా ఇంకా పూర్తి స్థాయిలో లబ్ధిదారులకు వాటిని ఎందుకు అందుబాటులోకి తీసుకురాలేదని ప్రశ్నించారు. వాటిపై వైసీపీ ప్రభుత్వం దష్టిపెట్టలేదని ఆయన విమర్శించారు. టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తే, పేరు టీడీపీకి వస్తుందని అదే సమయంలో జగనన్న కాలనీల పేరుతో కొత్తగా స్థలం ఇచ్చి,ఇల్లు కట్టించి ఇస్తే ఆ పేరు జగన్ కి వస్తుందని వారి ఆలోచన అని వ్యాఖ్యానించారు. టీడీపీ హయాంలో దాదాపుగా నిర్మాణం పూర్తైన ఇళ్లు,ఇప్పటి వరకూ లబ్ధిదారులకు ఎందుకు అందించలేదనే చర్చ మొదలైందని అన్నారు. ఇప్పటికైనా టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ కార్యదర్శి అమ్మినేని కేశవ నాయుడు, ఆరో వార్డు ఇన్‌ఛార్జి బేకరీ నాయుడు, హరి, చెన్నకృష్ణ పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నిరసన దీక్షను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

రాయలసీమ హక్కులపై కర్నూల్లో ఈనెల 24న జరిగే ఒక్కరోజు నిరసన దీక్షను విజయవంతం చేయాలని రాయలసీమ స్టీరింగ్ కమిటినాయకులు ఆర్‌విఎస్ సీమకృష్ణ నాగభూషణం కోరారు. ఈ మేరకు స్థానిక స్పందన ఆస్పత్రి ఆవరణంలో నిరసన దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆస్పత్రి వైద్యులు బషీర్ తో కలిసివారు శనివారం విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమకు నీరు, నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈ సమస్యలపై ఈనెల 24న కర్నూల్లో రాయలసీమ స్టీరింగ్ కమిటి చైర్మన్ బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన దీక్ష చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజర్ బాబా, దిల్‌దార్, స్టీరింగ్ కమిటీనాయకులు సుధాకర్, రవీంద్ర, నాగభూషణం, గోపాల్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని లెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరు చాంబర్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పై సిపిఒ, గ్రామ వార్డు నోడల్ అధికారులతో, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన పనులకు అవసరమైన ప్రతిపాదనలు త్వరితగతిన పంపాలన్నారు. 1466 పనులు మంజూరు కాగా 995 పనులు వివిధ దశలలో పురోగతిలో ఉన్నాయని, మిగిలిన పనులను చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిపిఒ విజయ్ కుమార్, నోడల్ అధికారి శివారెడ్డి, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎపిఇఎపి సెట్-2023 దరఖాస్తుల వెల్లువ

అనంతపురం : ఇంజనీరింగ్, ఫార్మాసీ, అగ్రికల్చర్, బిఎస్‌సి నర్సింగ్ (ఈఏపీసెట్-23) ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తుల వెల్లువ వస్తున్నట్లు ఎపిఇఎపి సెట్ కన్వీనర్ శోభాబిందు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం నాటికి 2,25,850 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. 2022లో ఇంజినీరింగ్ విభాగంలో 2,06,579 మాత్రమే దరఖాస్తులు వచ్చాయన్నారు. విద్యార్థులకు ఇప్పటి వరకు పరీక్ష సెంటర్లకు ఇచ్చిన ప్రాధాన్యతలకు అనుగుణంగా పరీక్ష కేంద్రాలను మార్చినట్లు తెలిపారు. ఇది వరకే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మళ్లీ మరోసారి దరఖాస్తులను డౌన్లోడ్ చేసుకున్నట్లయితే వారి పరీక్ష కేంద్రాల వివరాలను తెలుసుకోవచ్చన్నారు.

పీపుల్స్ సర్వే చారిత్రాత్మకం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల పైన ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు పీపుల్స్ సర్వే నిర్వహించడం జరుగుతోందని మాజీ మంత్రి శంకర్ నారాయణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహ సారథులు ప్రజల వద్దకు వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమానికి ప్రజల నుండి వస్తున్న స్పందనను చూసి చంద్రబాబు, లోకేష్ బాబు కు నిద్ర పట్టడం లేదన్నారు. పవన్ కళ్యాణ్ కు ప్యాకేజీ పై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై లేదన్నారు. ఆయనకు ముఖ్యమంత్రి జగన్ గురించి మాట్లాడే అర్హత లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ నాగలూరు బాబు, టౌన్ కన్వీనర్ నరసింహ, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి,మాజీ సింగిల్ విండో అధ్యక్షులు మునిమడుగు శ్రీనివాసులు, మాజీ మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, నాయకులు దివాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు

ధర్మవరం టౌన్ : విద్యతోనే ఉత్తమ భవిష్యత్తు లభిస్తుందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, టూ టౌన్ సిఐ రాజా, రిటైర్డ్ ఎంఇఒ చిన్నపరెడ్డి తెలిపారు. పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డు-రిజ్వాన్స్ విశ్వ భారతి హై స్కూల్లో శనివారం సాయంత్రం యాన్యువల్ డే, చిల్డ్రన్ గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులు మాట్లాడుతూ నేటి కాలంలో సైన్స్ టెక్నాలజీ అతి ముఖ్యమైనదని అన్నారు. దీని ద్వారా ఏ సమస్య అయినా విజయవంతంగా పరిష్కరించే అవకాశం ఉందన్నారు. ఇష్టపడి చదివినప్పుడే భవిష్యత్తులో ఒక ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చాన్నారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ షేక్ శకున్, వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రిజ్వాన్ భాషా, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నాణ్యమైన విద్యనందించాలి

ధర్మవరం టౌన్ : విద్యార్థినులకు నాణ్యమైన విద్యతోపాటు చక్కటి ఆహారాన్ని కూడా అందించాలని సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి సూచించారు. మండల పరిధిలోని మోటుమర్ల గ్రామంలో గల కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థునులకు గల వసతులపై ప్రిన్సిపాల్ చంద్రకళను అడిగి తెలుసుకున్నారు. విద్యా వైద్య సదుపాయాలను పరిశీలించారు. లైంగిక దాడుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, తమ వసతులు, భోజన విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే తెలపాలని విద్యార్థినులకు సూచించారు. పాఠశాల వరకు గల మట్టి రోడ్డు ను తొలగించి తారురోడ్డు నిర్మాణం చేసేలా చూడాలని పలువురు విద్యార్థినులు జడ్జిని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి

విద్యుత్ సబ్ స్టేషన్ ముందు రైతుల ఆందోళన

అమరాపురం : మండలంలోని హెచ్ డి హళ్లి విద్యుత్‌సబ్‌స్టేషన్ ముందు రైతులు శనివారం దాదాపు రెండు గంటల పాటు రైతులకు విద్యుత్ సరఫరా సరిగా చేయడం లేదని వాపోయారు. శనివారం సబ్ స్టేషన్ ముందు రైతులు ర్యాలీ నిర్వహించారు.ముందు రైతులకు 9 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇచ్చేవారని ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. స్పందించిన విద్యుత్ ఎఇ మహేష్, రియల్ ఎస్టేట్ లైన్‌ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మూడు రోజుల్లోగా హెచ్డి హళ్లి పరిధిలోని ఉన్న రైతులకు ఎటువంటి అంతరాయం లేకుండా 9 గంటల పాటు విద్యుత్ అందిస్తామని చెప్పడంతో రైతులు వెను తిరిగి వెళ్లారు,

మున్సిపల్ కార్మికుల విజయం

పుట్టపర్తి అర్బన్ : మున్సిపల్ కార్మికుల గత ఐదు రోజుల పోరాటం విజయవంతంగా ముగిసిందని మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, పట్టణ సిఐటియు కార్యదర్శి పైపల్లి గంగాద్రి తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూగత ఐదు రోజులుగా కార్మికులు సమ్మెలో పాల్గొని వివిధ రూపాల్లో నిరసన తెలిపినందునే అధికారులు, పాలకులు స్పందించారన్నారు. ఇది ముమ్మాటికి కార్మికుల విజయమన్నారు. కార్మికుల సమ్మెకు వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారన్నారు. కార్మికులు, సిఐటియు తరపున వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి మండల పరిధిలోని మామిళ్ళకుంట క్రాస్ లో నివాసముంటున్న ఎం శ్రీనివాసుల కుటుంబానికి రూ.5 లక్షల రూపాయలు చెక్కును అందజేశారు. శనివారం కర్నూలులో జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చేతుల మీదుగా శ్రీనివాసులు భార్యకు బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షుడు టిసి వరుణ్, జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు చిలకం మధుసూదన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పత్తి చంద్రశేఖర్, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు


ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ , రమణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక వైద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తున్న ఆశా వర్కర్ల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూడటం దారుణమన్నారు. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించి కనీస వేతనం రూ 26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు ఉమాదేవి, తార, జానకి , వేదవతి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు ఖర్జూరాల పంపిణీ

హిందూపురం : పవిత్ర రంజాన్‌ను పురస్కరించుకుని 25వ వార్డు కౌన్సిలర్ రాఘవేంద్ర తన వార్డులో ముస్లీం సోదరులకు శనివారం సాయంత్రం ఖర్జూరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఖర్జూర ఫలాలు కానుకగా అందివ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు డిఇ. రమేష్ కుమార్, నాయకులు దుర్గా నవీన్, నాగేంద్ర, సాదిక్, అన్వర్ భాష, నయాజ్, చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - హిందూపురం టౌన్

అగ్ని ప్రమాదాలపై ప్రజలందరు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనావుందని అగ్నిమాపక శాఖాధికారి ప్రభాకర్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని రహమత్‌పురం, తెలుగుతల్లి సర్కిల్‌తో పాటు ఆర్‌టిసి బస్టాండ్ ఎదురుగా అగ్నిమాపక అధికారులు, సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేశారు. అదే విధంగా అగ్నినిరోధక పరికరాల పట్ల వివరించి వాటిని ఎలా వినియోగించాలో చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నల్లచెరువు : మండల పరిధిలోని గోరంట్ల వారి పల్లి కి చెందిన వైసిపి కార్యకర్త బయారెడ్డి అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బసిరెడ్డి విశ్వనాథరెడ్డి, దశరథ నాయుడు, శ్రీధర్ రెడ్డి, లక్ష్మీపతి, కృష్ణారెడ్డి, రామకిషోర్, అంజి వాల్మీకి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్‌పై విషప్రచారం మానాలి : మాజీ ఎమ్మెల్యే

మడకశిర రూరల్ : నారాలోకేష్‌పై విషప్రచారం మానాలని మాజీ ఎమ్మెల్యే ఈరన్న హెచ్చరించారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈరన్న మాట్లాడుతూ వైసిపి పాలనలో దళితులపై జరుగుతున్న దాడులను నారా లోకేష్‌కు వివరిస్తే దానిని వక్రీకరించడం దారుణమన్నారు.

అనారోగ్యంతో టిడిపి నాయకుడు మృతి

రొద్దం : మండల కేంద్రానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఎస్‌ఇ సెల్ మండల అధ్యక్షులు గోవిందరాజులు (50) అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బికె. పార్థసారధి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, పెనుకొండ నియోజకవర్గం అధ్యక్షులు చిన్నప్పయ్య, కన్వీనర్ నరహరి, మురళి, హరీష్, అక్బర్, ఈడిగశీనా, చంద్రశేఖరనాయుడు, వెంకటేశులు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

మడకశిర రూరల్ : మండల పరిధిలోని శ్రీ వెంకటేశ్వర వద్ధాశ్రమంలో పట్టణంలోని బాబా, మెకానిక్ దాదు వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాభావంతో ఉండాలని సూచించారు. తద్వారా మానవతా విలువలు పెరిగే అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు

భూసార పరీక్షలపై అవగాహన

నంబూలపులకుంట : మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల సహాయకులకు మట్టి పరీక్ష సేకరణ పై శనివారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ లోకేశ్వర్ రెడ్డితో పాటు ఎఇఒ శిరీష, ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు

మడకశిర రూరల్ : పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులకు నేలలో లభ్యమయ్యే పోషకాలు గురించి అధికారులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు,

అనంతరం సాయిల్ టెస్ట్ ట్రైనింగ్ లో భాగంగా నాగిరెడ్డి పొలంలో మట్టి నమూనాలు ఏవిధంగా సేకరించాలన్న దానిపైన ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో ఎఒ వీర నరేష్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : మండల వ్యవసాయ అధికారి డి శ్రీలత అధ్యక్షతన లేపాక్షి-3 రైతు భరోసా కేంద్రంలో సిబ్బందికి భూసార పరీక్ష పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో సలహా మండలి సభ్యులు శంకరప్ప, శంకర్ రెడ్డి, తిప్పన్న,కగ్గలప్ప రైతులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : భూసార పరిక్షలు మట్టి నమూనా సేకరణపై చిలమత్తూరు -1 ఆర్‌బికెలో శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఒ వంశీకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి మల్లికార్జున, ఆర్‌బికె సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 52ను ఉపసంహరించుకోవాలి

సోమందేపల్లి : బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని తీసుకువచ్చిన జీవో నెంబర్ 52 ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు అంజినాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో స్థానిక గిరిజనులు శనివారం ఎన్టీఆర్ సర్కిల్లో మానవహారం ఏర్పాటు చేసి, గిరిజనులకు న్యాయం చేయాలని నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 70 సంవత్సరాలు పూర్తి అయినా నేటికీ గిరిజనులు ఆర్థిక ,సామాజిక, రాజకీయంగా వెనుకబాటు తనంలో ఉన్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితులలో అధిక జనాభా ఆర్థికంగా అభివృద్ధి చెందిన కొన్ని కులాలను ప్రభుత్వం ఎస్టీ జాబితాలో చేర్చాలని నిర్ణయించడం అన్యాయమన్నారు. గిరిజనుల జీవితాలను నిర్వీర్యం చేసే జీవో నెంబర్ 52ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రనాయక్, అడ్వకేట్ విక్రాంత్ నాయక్, పెద్ద ఎత్తున గిరిజన మహిళలు పాల్గొన్నారు.

నైపుణ్యతపై మహిళలకు శిక్షణ

పుట్టపర్తి అర్బన్ : మహిళలకు హౌస్ కీపింగ్, కుకింగ్, క్యాటరింగ్‌పై శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తుందని జాబ్ కోఆర్డినేటర్ ఆంజనేయులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన మహిళలకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ శిక్షణ ఇస్తుందన్నారు. శిక్షణతో పాటు గల్ఫ్ దేశాలలో ఉపాధి కల్పిస్తుందన్నారు. రాష్ట్రంలో కొంతమంది మహిళలు నకిలీ ఏజెంట్ల మోసాల వలలో చిక్కుకొని సరైన పత్రాలు లేకుండా గల్ఫ్ దేశాలలోని చట్టాలు తెలియక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇది గమనించిన రాష్ట్ర ప్రభుత్వం శిక్షణతో పాటు విదేశాలలో మతపరమైన సంస్కృతులు వారి పద్ధతులు, అలవాట్లతో పాటు ఆయా దేశాల్లోని చట్టాలలో అవగాహన కల్పిస్తుందన్నారు. గల్ఫ్ దేశాలలో ఉద్యోగాలు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందని, దీంతో మోసపోవడం జరగదని అన్నారు. ఐదవ తరగతి చదివి, చదవడం, రాయడం తెలిసిన మహిళలు ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కార్మిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం

బుక్కపట్నం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై అలంబిస్తున్న వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఇఎస్ వెంకటేష్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో అంగన్వాడీ, సివిల్‌సప్లయ్, ఆశా వర్కర్లతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలన్నారు. పోరాటాలతోనే కార్మికుల హక్కులను కాపాడుకోగలుగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బ్యాళ్ల అంజి, అంగన్వాడీ అధ్యక్షురాలు నాగమణి, మంజుల, సివిల్ సప్లై కార్మికులు రామదాసు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

చట్టలపై అవగాహన

రొద్దం : మండలంలోనిశేషాపురం గ్రామంలో అనంతశక్తి సొసైటీ ఆధ్వర్యంలో సీఈఓ లావణ్య, అధ్యక్షురాలు క్రిష్టమ్మ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు, గృహహింస, మద్యపానం లాంటి విషయాలపై నాటిక రూపంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనంతశక్తి సీఈఓ లావణ్య మహాశక్తి సీఈఓ రజిని, టింబెక్టివ్ కలెక్టివ్ నుండి సుకన్య, దుర్గాశక్తి నుంచి కవిత, సుబ్బరాయుడు మహాశక్తి వైస్ ప్రెసిడెంట్ రామలక్ష్మమ్మ, న్యాయ సలహా కేంద్ర కమిటీ సభ్యులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

కొత్తచెరువు : ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని పుట్టపర్తి ఎమ్మెల్యే డి శ్రీధర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కోడపగానపల్లిలో శనివారం నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రజాసంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీపీ గాయత్రి రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి, సర్పంచి అలివేలమ్మతో పాటు నాయకులు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే